క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఎస్కేపీ హైస్కూల్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ జయరామ్

డోన్ టౌన్ : త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం ఏఈ రసూల్, టౌన్ ప్లానింగ్ అధికారి అంజాద్‌బాషాతో కలిసి మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ పరిశీలించారు. ఎస్కేపీ హైస్కూల్, చిగురమానుపేటలోని ప్రభుత్వ స్కూల్, గుత్తిరోడ్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీసుధ హైస్కూల్ తదితర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రధాన రహదారి నుండి పోలింగ్ కేంద్రానికి రూట్ మ్యాప్, అక్కడ వసతులు, పరిసరాల తీరుపై కమిషనర్ ఆరా తీశారు.

సన్మానం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం

ప్యాపిలి: స్థానిక ప్రాథమిక పాఠశాల (హెచ్‌డబ్ల్యు)లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న షర్మిల సుహాసిని ఈ నెలాఖరుతో పదవీ విరమణ కానున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఎస్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకట్‌నాయక్, నాయకులు చిన్నపరెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు షర్మిల సుహాసిని సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్ రెడ్డి, నాగమల్లేశ్, రామాంజనేయులు, ఇబ్రహీం సాహెబ్, విజయ్‌కుమార్ రెడ్డి, ప్రభావతి, సునీత, గురువర్ధిని, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కిడ్నీ వ్యాధి బాధితుడిని పరామర్శిస్తున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని పంచమపేట రంపం మిల్లు సమీపంలో నివాసం ఉంటున్న కిడ్నీ వ్యాధి బాధితుడు ఇబ్రహీంను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి గురువారం పరామర్శించారు. డయాలసిస్ చికిత్స తీసుకుంటున్న విషయం తెలుసుకున్న కాటసాని ఓబులరెడ్డి ఇబ్రహీం ఇంటికి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే బాధిత ఇబ్రహీంకు తనవంతుగా కాటసాని ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్, జిల్లా కార్యదర్శి పెద్దన్న, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు గౌస్‌పీరా, షేక్‌హుస్సేన్, దస్తగిరి, గౌండ రసూల్, మహమ్మద్ హుస్సేన్, షాషావలి తదితరులు పాల్గొన్నారు.

పాముల జీవన విధానంపై అవగాహన



మాట్లాడుతున్న మహమ్మద్ ఇద్రూస్‌ఖాన్

డోన్ టౌన్ : జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో చిన్న మల్కాపురం రోడ్డులో ఉన్న నగరవనంలో గురువారం విద్యార్థులకు పాముల జీవన విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈస్టరన్ గాట్స్ వైల్డ్ లైఫ్ సొసైటీ తరుపున కార్యక్రమానికి హాజరైన స్నేక్ రెస్క్యూయర్ మహమ్మద్ ఇద్రూస్‌ఖాన్ మాట్లాడుతూ ప్రతి జీవి పర్యావరణ పరిరక్షణలో భాగంగా తన జీవిత విధానం రూపొందించబడిందన్నారు. అందులో భాగంగా పాములు కూడా మానవ జీవితంలో ముడిపడి ఉన్నాయని, వాటి వలన పర్యావరణ పరి రక్షణతో పాటు వ్యవసాయ రంగంలో రైతన్నలకు చేదోడుగా నిలుస్తాయన్నారు. పాముల రకాలు, వాటిలో విష ప్రభావం, వాటి నుంచి ఏలా రక్షణ పొందాలి తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో డోన్ ఫారెస్టు రేంజర్ ప్రవీణ్‌కుమార్, సెక్షన్ ఆఫీసర్ శివకుమార్, బీట్ ఆఫీసర్లు భారతి, శివమ్మ, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ వీరకుమార్,ఉ పాధ్యాయులు సునిత, గోపిచంద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచితం కోచింగ్

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో పాలిసెట్‌కు ఉచితంగా కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు పాలిటెక్నికల్ ప్రిన్సిపాల్ రాజేష్ తెలిపారు. మార్చి 30 నుంచి ఏప్రిల్ 5వ తేదీలోపు దరాఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 27 పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆర్టిఫిషియల్, మిషన్‌లర్నింగ్ కోర్సు, మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇజినీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ కోర్సులకు సంబంధించి చేరు ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 400, ఎస్టీ, ఎస్సీ విద్యార్థులు రూ.100 అప్లికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.



నంద్యాలలో గురువారం నిర్వహించిన మేమంతా సిద్ధం సభలో డోన్ ఎమ్మెల్యే అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని ప్రజలకు పరిచయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



నంద్యాలలో గురువారం నిర్వహించిన మేమంతా సిద్ధం బహిరంగ సభలో బనగానపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రామిరెడ్డిని ప్రజలకు పరిచయం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆర్.లింగందిన్నె...
అభివృద్ధిలో మిన్న!

- గ్రామానికి డీబీటీతో రూ.14. 04 కోట్లు, నాన్ డీబీటీతో రూ.4.36 కోట్లు లబ్ధి
- ప్రభుత్వ కార్యాలయాలతో గ్రామానికి పట్టణ శోభ
- తీరిన ఏళ్లనాటి రహదారి సమస్యలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



రూ.43 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం



సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసింది. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వడంతో గ్రామాలు అభివృద్ధి బాటపట్టాయి. సచివాయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణాలతో పల్లెలు కళకళలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో సంజామల మండలంలోని ఆర్.లింగందిన్నె గ్రామం సైతం అభివృద్ధిలో మిన్నగా నిలిచింది. ఈ గ్రామంలో దాదాపు 310 కుటుంబాలు ఉండగా దాదాపు 950 మంది జనాభా ఉన్నారు. ఆర్.లింగందిన్నె గ్రామానికి సంబంధించి డీబీటీతో రూ.14. 04 కోట్లు, నాన్ డీబీటీతో రూ.4.36 కోట్లు లబ్ధి చేకూరింది. దీంతో గ్రామం అభివృద్ధితోపాటు పేదలు సైతం ఆర్థికాభివృద్ధి బాట పట్టారు. గత ప్రభుత్వంలో కనీస మౌలిక వసతులు కరువై ఇబ్బందులు ఎదుర్కొన్నారు గ్రామస్తులు. ప్రత్యేకించి కాలనీల్లో గుంతలమయమైన రోడ్లతో రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఇక వర్షాకాలం కాలనీలు బురదమయం అయ్యేవి. నీటి నిల్వ చేరడంతో దుర్గంధం వెదజల్లేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామం రూపురేఖలు మారిపోయాయి. సీసీ రోడ్ల నిర్మాణంతో కాలనీలు కళకళలాడుతున్నాయి. గతంలో చిన్నపాటి అనారోగ్యానికి గురైనా దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి. నేడు గ్రామంలోనే ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ ఏర్పాటు చేయడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మన బడి నాడనేడుతో కార్పొరేట్ స్కూల్‌ను తలపిస్తుంది ప్రాథమిక పాఠశాల. పొలాలకు రహదారులు ఏర్పాటుతో గతంలో దిగుబడులు తరలించుకునేందుకు పడిన ఇబ్బందులను గుర్తు చేసుకుంటున్న రైతులు ప్రభుత్వ స్పందనపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్. లింగందిన్నె అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు ఆ గ్రామ ప్రజలు.



రూ.21 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనం

ఆర్.లింగందిన్నెలో జరిగిన అభివృద్ధి పనులు

- రూ.43 లక్షలతో నూతన గ్రామ సచివాలయ భవనం
- రూ.24 లక్షలతో రైతు భరోసా కేంద్రం
- రూ.32 లక్షలతో ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణం
- రూ.38 లక్షలతో కాలనీలలో సీసీ రోడ్లు, డ్రేనేజీ నిర్మాణం
- రూ.35 లక్షలతో గ్రావేల్ రోడ్లు
- రూ.26 లక్షలతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు పైపులైన్
- రూ.25 లక్షతో ప్రాథమిక పాఠశాల అభివృద్ధి
- రూ.21 లక్షలతో హెల్త్ క్లినిక్ భవనం
- రూ.34 లక్షలతో గిద్దలూరుకు రోడ్డు



రూ.32 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్



కాలనీలో మెరుస్తున్న సీసీ రోడ్డు



రూ.24 లక్షలతో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రం

చాలా సంతోషంగా ఉంది



పంట దిగుబడులు ఇంటికి తెచ్చుకునేందుకు రహదారి సరిగా లేక చాలా ఇబ్బందిగా ఉండేది. పొలాల రస్తాలకు ప్రాధాన్యనిస్తూ గ్రావెల్ రోడ్లు వేశారు. ఇప్పుడు దిగుబడులను సాఫీగా ఇంటింకి తెచ్చుకుంటున్నాం. చాలా సంతోషంగా ఉంది. అదేవిధంగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలతో సేవలు ప్రజలకు మరింత చేరువ అయ్యాయి. ఇలాంటి ప్రభుత్వ పాలనను ఎన్నడు చూడలేదు. జగనన్న ప్రభుత్వానికి అండగా నిలబడుతాం. -మద్దిరాల ప్రేమ్ రాజు, ఆర్.లింగందిన్నె గ్రామం

రహదారి సమస్యలు తీరాయి



గ్రామంలో రహదారులు సమస్యలు తీరాయి. గతంలో రోడ్లు గుంతలమయంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. వర్షాకాలం పరిస్థితి మరీ అధ్వానంగా ఉండేవి. గతంలో రోడ్లు సమస్యలను పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. ప్రస్తుతం సీసీ రోడ్లు వెలిశాయి. రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. అదేవిధంగా సచివాలయ, ఆర్బీకేల సేవలు బాగున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
– హుస్సేన్‌బీ, ఆర్.లింగందిన్నె గ్రామం

ఎమ్మెల్యే కాటసాని చొరవతో గ్రామం అభివృద్ధి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామం ప్రగతి బాటలో నడుస్తుంది. గ్రామంలో ప్రతి సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం చూపుతున్నాం. గ్రామంలో గ్రావెల్ రోడ్లు, సీసీ రోడ్లు, ఓహెచ్‌ఆర్ ట్యాంక్, హెల్త్‌క్లినిక్ భవనం , గ్రామ సచివాయం, రైతు భరోసా కేంద్రాలు వంటివి ఏర్పాటు చేయడంతో ప్రజలకు సేవలు మరింత సులభతరం అయ్యాయి. గ్రామంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాతో సంతోషంగా ఉన్నారు.
– అన్నెం శివరామిరెడ్డి, ఆర్.లింగందిన్నె సచివాలయ కన్వీనర్

రేపటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండలంలోని చిన్నమల్కాపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న మల్కాపురం, రంగాపురం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు, ఫ్యాక్టరీలకు శుక్ర, శని, ఆదివారాలు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి త్రీ ఫేస్ కరెంటు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరా చేస్తామన్నారు. ప్రజలు, ఫ్యాక్టరీ యాజమాన్యాలు, రైతులు సహకరించాలని కోరారు.

మంచినీటి పథకం పునరుద్ధరణ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో మంచినీటి పథకాన్ని సర్పంచ్ నాగన్న ఆధ్వర్యంలో గురువారం పునరుద్దరించారు. మదనంతపురం సమీపంలో ఉన్న మంచినీటి పథకం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో విద్యుత్ తీగ పూర్తిగా కాలిపోయి నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడింది. మంచినీటికి ప్రత్యామ్నాయం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో కొత్తగా విద్యుత్ తీగ ఏర్పాటు చేసి ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా ప్రజలకు యథావిధిగా తాగునీటి సరఫరా చేశారు.

మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

డోన్ టౌన్ : ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరం ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో ఈ నెల 28 నుంచి మే 22వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్స్‌పాల్ జాస్మిన్ తెలిపారు. కేవలం ఇంగ్లిష్ మీడియం మాత్రమే అందుబాటులో ఉందని, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయన్నారు. దరఖాస్తు రుసుం కింద ఓసీ, బీసీలు రూ. 200, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.150 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు స్టడీ, ఆధార్ కార్డులను జత చేసి స్థానిక మోడల్ స్కూల్‌లో అందజేయాలని సూచించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

ప్యాపిలి: పింఛన్ల పంపిణీ సమయంలో వలంటీర్లు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ సాయిమనోహర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. పింఛన్ల పంపిణీ సమయంలో వలంటీర్లు తమ వద్ద అధికారులు ఇచ్చిన పత్రాన్ని వెంట ఉంచుకోవాలన్నారు. ఆ పత్రంలో వలంటీర్ దగ్గర ఉన్న నగదుకు సంబంధించిన వివరాలు ఉంటాయన్నారు. అధికారులు, రాజకీయ నాయకులు అడిగితే వలంటీర్ తప్పనిసరిగా ఆ పత్రాన్ని చూపించాలన్నారు. పత్రంలో నమోదు చేసిన నగదు కంటే ఎక్కువ నగదు వలంటీర్ దగ్గర ఉంటే తొలగిస్తామని ఎంపీడీఓ స్పష్టం చేశారు.

పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం



వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

డోన్ : పేదల ఆర్థికాభివృద్ధే సీఎం వైఎస్ జగనన్న లక్ష్యమని, ఆ దిశగా సంక్షేమ పథకాలు అమలు చేసి వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనిచ్చారని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌లు పేర్కొన్నారు. పట్టణంలోని తారకరామనగర్ ప్రాంతంలో రెండవరోజు గురువారం వారు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వారు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలను అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందజేశారని గుర్తు చేశారు. పేద ప్రజల పిల్లలు ధనువంతులకు దీటుగా ఇంగిష్ మీడియం అభ్యసించేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, రైల్వే నాగేంద్ర, ఆర్ట్ రమణ, వెంకట్రాముడు, సుంకన్న, మేకల విమల, మిట్టా ఉమామహేశ్వరి, మల్లికార్జునరెడ్డి, మహేశ్వరరెడ్డి, శరత్, బోయ సుమలత, నాయకులు బుర్రు శ్రీధర్, అశోక్, వెంకటేష్, మహేంద్రనాయుడు, పెయింటర్ మాబు, రంగస్వామి, ఎల్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి

బనగానపల్లె రూరల్ : వ్యవసాయంలో నూతన సాంకేతికతపై యువత నైపుణ్యం పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సీనియర్ ప్రధాన శాస్త్రవేత్త ధనలక్ష్మీ సూచించారు. మండలంలోని యాగంటిపల్లె సమీపంలో ఉన్న కేవీకేలో కర్నూలు ఆత్మ ఆధ్వర్యంలో యువతకు డ్రోన్‌పై ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె యువతను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామీణ యువత డ్రోన్ పైలెట్‌గా రాణించి సొంతంగా ఉపాధి పొందాలన్నారు. టెక్నికల్ ఏఓ మధుమతి మాట్లాడుతూ డ్రోన్ పైలెట్ శిక్షణ కోరకు ఏఓలను సంప్రదించాలని సూచించారు. శిక్షణ పూర్తికా గానే డ్రోన్ లైసెన్స్ కోరకు 12 రోజుల పాటు గుంటూరులో శిక్షణ ఉంటుందన్నారు. డ్రోన్ పనితీరును వ్యవసాయ ఇంజినీర్ సోహెల్ వివరించారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం చక్రవర్తినాయక్, కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, రవిగౌడ్ పాల్గొన్నారు.

31న పీఓ, ఏపీఓలకు శిక్షణ

బేతంచెర్ల: సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించేందుకు జిల్లా ఉన్నతాధికారులు 192 మంది పీఓ, ఏపీఓలను నియమించారని తహసీల్దార్ జీవన్ చంద్రశేఖర్ తెలిపారు. పీఓ, ఏపీఓలకు ఈనెల 31 డోన్ పట్టణంలో ఆర్డీఓ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం ఉంటుందన్నారు. ఉత్తర్వులు అందిన పీఓ, ఏపీఓలు తప్పనిసరిగా ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరు కావాలని సూచించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

అవుకు: మండల కేంద్రంలోని అక్షరజ్యోతి ట్యుటోరియల్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ రమేష్ గురువారం తెలిపారు. మదర్ మోడల్ స్కూల్, కేబీఎస్ స్కూల్స్‌లో నాల్గవ తరగతి చదువుతున్న స్రవంతి, పరిమళ అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి సీటు సాధించారన్నారన్నారు. అలాగే అవుకు పట్టణానికి చెందిన సత్య దినేశ్వర్ అనే విద్యార్థి సైనిక్ స్టూడెంట్‌గా సీటు సాధించాడని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పురోహితుడికి గాయాలు

ప్యాపిలి: పట్టణ సమీపంలోని స్థానిక వైభవ్ దాబా వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన పురోహితుడు గిరి స్వామి గాయపడ్డాడు. ద్విచక్రవాహనంపై గుత్తి నుంచి ప్యాపిలికి వస్తున్న అతన్ని కర్నూలు వైపు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో గిరి స్వామి కాలికి, తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని కర్నూలులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

సంక్షిప్తం

గడ్డివామి దగ్ధం

డోన్ రూరల్ : మండల పరిధిలోని దొరపల్లి గ్రామానికి చెందిన రైతు వడ్డె వెంకటేశ్వర్లు గడ్డివామి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సొంత దొడ్డిలో పశువుల కోసం వేసుకున్న గడ్డివామి ప్రమాదవశాత్తు కాలిపోవడంతో స్థానికులు ఫైర్ సిబబందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చి మంటలు వ్యాపించకుండా అదుపు చేశామని ఫైర్ సిబ్బంది తెలిపారు. రైతుకు దాదాపు రూ.50వేలు నష్టం కలిగినట్లు చెప్పారు.

నేడు బనగానపల్లెలో చంద్రబాబు ప్రజాగళం

బనగానపల్లె : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం పర్యటనలో భాగంగా శుక్రవారం బనగానపల్లెకు రానున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. సత్యసాయి జిల్లా కదిరి నుంచి హెలికాప్టర్‌లో బయలదేరి బనగానపల్లెకు ఉదయం 10 గంటలకు చేరుకుంటారన్నారు. పెట్రోల్ బంకు కూడలిలో బహిరంగ సభలో బాబు పాల్గొననున్నారు.



కొలిమిగుండ్ల: తుమ్మలపెంట నుంచి సీఎం బహిరంగ సభకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కోవెలకుంట్ల : ఆర్టీసీ బస్సులో వెళ్తున్న నాయకులు



సంజామల: ఆకుమల్ల నుంచి సిద్ధం సభకు బయల్దేరిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

'మేమంతా సిద్ధం' విజయవంతం

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు




సీఎం బహిరంగ సభకు వెళ్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన తనయుడు కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా గురువారం నంద్యాల డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బహిరంగ సభ విజయవంతమైంది. సీఎం బహిరంగ సభకు బనగానపల్లె, డోన్ నియోజకర్గాల నుంచి ఉదయం నుంచే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఆర్టీసీ బస్సులు, సొంత వాహనాలు, బైక్‌లలో పెద్దఎత్తు బయలుదేరారు. బనగానపల్లె నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, తనయుడు కాటసా ని ఓబులరెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. కొలిమిగుండ్ల, అవుకు మండలాల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావడంతో బనగానపల్లె పట్టణం కిటకిటలాడింది. అనంతరం నంద్యాలలో నిర్వహించే జగనన్న మేమంతా సిద్ధం బహిరంగ సభకు తరలివెళ్లారు.


కోవెలకుంట్ల: నంద్యాలలో గురువారం సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు కోవెలకుంట్ల మండలంలోని ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివెళ్లారు. ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జున రెడ్డి, రైతు సంఘం నాయకుడు కానాల రవీంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్లారు.

డోన్ : నంద్యాలలో గురువారం సీఎం జగనన్న నిర్వహించిన మేమంతా సిద్ధం బహిరంగ సభకు డోన్ నియోజకవర్గం నుండి భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్యేక వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్లారు. అదేవిధంగా పట్టణానికి చెందిన నాయకులు, కౌన్సిలర్లు బుగ్గన శేషారెడ్డి మార్గ్ నుంచి ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల నుంచి 50 బస్సులు, 100 వాహనాల్లో తరలివెళ్లినట్లు వైఎస్సార్‌సీపీ వర్గాలు తెలిపాయి.


బేతంచెర్ల: నంద్యాలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన మేమంతా సిద్ధం బహిరంగ సభకు బేతంచెర్ల మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, స్టేట్ ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్లు ముర్తుజావలీ, ఖాజా, గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, గూని నాగరాజు, దస్తగిరి, గుమ్మగాల్ల రాజు, ఎద్దులన్న, యాకోబ్, కుమార్, వెంకటేశ్వర్లు, బలరాముడు, వలీబాషా, మధు సూధన్‌రెడ్డి తదితర కార్యకర్తలు మహిళలు బహిరంగ సభకు బయలుదేరారు.



డోన్ : కన్నపకుంట నుంచి బహిరంగ సభకు బయలుదేరుతున్న మహిళలు



ప్యాపిలి : బస్సులో తరలివెళ్తున్న గుడిపాడు వైఎస్సార్‌సీపీ నాయకులు



బేతంచెర్ల: నంద్యాలకు బయలుదేరుతున్న దుర్గాపేట కాలనీవాసులు

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

డోన్ : వేసవి నేపథ్యంలో రాబోయే రెండు నెలలు ఎండలు తీవ్రమయ్యే అవకాశం ఉందని, ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ మాధవి సూచించారు. మండలంలోని యు కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు సన్‌స్ట్రోక్‌పై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, చిన్నపిల్లలు ఒంటిపూట బడులు అయిపోయిన తర్వాత బయటకు వెళ్లకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా డాక్టర్ సూచించారు. పిల్లలు, వృద్ధులు వడదెబ్బకు మృత్యువాత పడే అవకాశం ఉంటుందన్నారు. మంచి నీటితో పాటు పలుచని మజ్జిగ, నిమ్మరసం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.